కథ

# వేగుచుక్క

జాస్తి రమాదేవి
93915 55364

ఆకాశంలో ఎర్రెర్రని సూరీడు దాహంతో మసిలిపోతున్నడు. చెట్టుకింద కూర్చుని, 'చెయ్ చెయ్!' అంటూ పందుల్ని అదిలిస్తున్నడు ఎరుకల తిరుపతయ్య.

పెద్దబండి మీద అటుగా వెళ్తున్న ఆ ఊరి పెద్దదొర కొడుకు జగన్నాథం.. తిరుపతయ్యను చూసి ఆగిండు.

''ఏరా!'' అన్నడు.. అహంకారం ఉట్టిపడే గొంతుతో.

తిరుపతయ్య తలకు చుట్టుకున్న తుండుగుడ్డను చేత్తో పట్టుకొని, వొంగుని నిలబడ్డడు వినయంగా.

''ఏరా! నీ మన్మరాలు కలెక్టరయ్యి వస్తాందంట. ఏంది కత? మీ వోళ్లందర్నీ సిమ్మాసనం ఎక్కిపిస్తదా ఏంది? ఇంక పందుల్తో నీకేందిరా? సక్కంగ కాళ్లు ఎగదన్నుకుంట మంచంల పండక!''..

వ్యంగ్యమో, కోపమో అర్థం కాలేదు తిరుపతయ్యకు.

''గదేంలే దొరా! పోరి సదూకుంది గంతే! మేం ఎంతటోళ్లం దొరా!?'' తలొంచుకొనే అన్నడు తిరుపతయ్య.

''గట్లుండాలె.. కండ్లు నెత్తికెక్కితె మంచిగుండది''.

''గట్లనే దొర!'' అన్నడు తిరుపతయ్య.

కడుపులో లావాలెక్క పొంగుకొస్తున్న కోపాగ్నిని గొంతుదాటి రానివ్వకుండా.. కండ్లు వాల్చుకొని దూరం జరిగిండు తిరుపతయ్య. గట్టిగా కిక్ కొట్టి బండిని ముందుకు పోనిచ్చిండు జగన్నాథం. దుమ్ము లేచొచ్చి, తిరుపతయ్య కంట్లో పడింది. అతని వైపు చూస్తూ ఉమ్మబోయి ఆగిపోయాడు. అది ఆ దొరమీద పడదు. భూతల్లి మీద పడుద్ది. ఆ తల్లేం చేసిందని? తలదాచుకోను చోటిచ్చింది. మనిషి కన్నా భూమి, ఆకాశమే గొప్పయి. వాటికి పెద్దా – పేదా అనే తేడాలుండవు.

పందులు గురుక్ గురుక్ అంటూ.. ఇంటిదారి పట్టాయి. అవి గూట్లోకి వెళ్లగానే.. చెక్క అడ్డుపెట్టిండు.

కాళ్లూ, చేతులు, ముఖం కడుక్కొని.. నులకమంచంలో కూలబడ్డడు. చెంబుతో నీళ్లు తెచ్చి ఇచ్చింది కూతురు మాలచ్మి.

''ఏంది నాయ్నా గట్లున్నవ్!?'' అడిగింది.

''గదే బిడ్డా! మన నాగమణి వత్తాందని చిన్నదొరకు తెల్సినట్టుండాది. కండ్లు నెత్తినెట్టుకోకుండ్రని యాజ్జేస్తుండు. పందులు కాస్కుంట ఊరి సివర్నే ఉండాల్నంట!''.. నీళ్లు తాగి అన్నడు తిరుపతయ్య.

''గది ఎప్పుడున్న లొల్లే గదా? మన నాగులు ఎప్పుడొస్తదో సెప్పిందా?''.

''రేప్పొద్దుగాల వస్తాందిలే బిడ్డా! మంచిగ వొండిపెట్టు నీ బిడ్డకు''.

''సుట్టున్న మనోళ్లకు పందిని కోసి దావతియ్యాల్నా ఏంది మావా?''.. అప్పుడే వచ్చిన అల్లుడు నారాయణ చొప్పకట్టను ఆవు ముందేసి అడిగిండు.

''ఒకటేంది.. రెండు కోద్దురు గానీ, నీ బిడ్డరానీ!'' అంటూ నవ్విండు తిరుపతయ్య.

వాతావరణం కొంచెం కులాసాగా మారిందనుకుని సంబురపడింది మాలచ్మి. ఆ రాత్రి సంబురంగ రెండు బింకీల కల్లు తెచ్చిండు నారాయణ. నల్లదాని వొరుగుల్ని మంగలంలో వేసి, చిన్న గరిటె నూనేసి ఎల్లిపాయ కారం చల్లి ముందెట్టింది మాలచ్మి. కల్లుతాగి, తిని అందరూ మంచాలెక్కిండ్రు.

ఎప్పుడు తెల్లారుద్దా? ఎప్పుడు నాగమణి వస్తదా? అని తల్చుకుంటా ఉంటే.. నిద్రరాలేదు ఎవలకూ.

గోడలకు వేలాడుతున్న ఫొటోలవైపు కండ్లనీళ్లతోనే చూసిండు తిరుపతయ్య. తల్లి మంగవ్వ, పెండ్లాం నాగమ్మ, కొడుకు మల్లేశు.. ముగ్గురూ పెద్దోళ్ల దాష్టీకానికే బలయినోళ్లు. ఎవరి బతుకులు వాళ్లవైనా.. ఎక్కడో లింకు తగులుతూ ఉంటది. సమాజంలో మనిషికీ మనిషికీ మధ్యన సంబంధాలు దేవుడు పెనవేసినా.. మనిషి వాటిని తెగ్గోసుకుంటూ పోతుంటడు.

* * *

మంగవ్వ తరతరాలుగా వస్తున్న వృత్తిధర్మంలా సోది బుట్ట పట్టుకొని, ఊరూరూ తిరుగుతూ ఎరుక చెప్పేది. సోది కావాల్సినోళ్లు పిల్చి, చెప్పించుకునేటోళ్లు. బియ్యంతోపాటు కొందరు పాతచీర, పైసలు కూడా ఇచ్చేటోళ్లు. తిరుపతయ్య అనాదిగా వస్తున్న సంపదలా పందుల్ని పెంచుతూ ఈత మట్టలు తెచ్చి, ఈనెలు తీసి బుట్టలు అల్లి ఊళ్లో అమ్మేటోడు. నాగమ్మ ఊళ్లో పురుళ్లు పోసేది. నాగమ్మను మంత్రసాని అని, ఎరుకలసాని అని అనేటోళ్లు ఊరోళ్లు.

ఊరంతా భూములున్న పెద్దదొరే.. ఊళ్లో పెద్దమనిషి. భూస్వాములను, అగ్రకులాల వారినీ గౌరవించకపోతే నరకానికి ఎన్ని మెట్లున్నాయో.. అన్ని మెట్లు ఎక్కాల్సొచ్చేది కింది కులాలోళ్లకు. ఎరుకలోళ్లు ఊరి చివర్నే నివాసం ఉండేటోళ్లు. ఎలాంటి ఆదరణా, గౌరవమూ వాళ్లకు దక్కేది కాదు. ప్రభుత్వం అందించే పథకాల జాడ తెలియనివాళ్లు. చదువులూ, ఉద్యోగాలు, రిజర్వేషన్ల కోటాలు.. అన్నీ దొబ్బుతున్నారని పెద్దోళ్లకు కోపంగా ఉండేది. 'బాంచెన్! మీ కాల్మొక్తా!' అన్న మాట వాళ్లకు అలవాటుగా మారిపోయింది. దొరల ఆగడాలకు, అహంకారాల నడుమ నలిగిపోయేటోళ్లు వీళ్లు.

తిరుపతయ్య తండ్రి మల్లేశం తలెగరేసి.. 'అన్నలకు సెబుతా!' అన్నందుకు, చావ చితగ్గొట్టి, పోలీసులకు అప్పగించిండ్రనీ, తర్వాత ఏ అవయవమూ పనిచెయ్యక సచ్చిండనీ మంగవ్వ ఏడ్చేది. 'గుస్సా సెయ్యక గమ్మునుండు!' అంటూ



'నమస్తే తెలంగాణ, ముల్కనూరు ప్రజాగ్రంథాలయం' సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ-2022'లో రూ.3 వేల బహుమతి పొందిన కథ.